క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీ విద్యార్థినికి కలెక్టర్ ప్రశంస



అంజలిని అభినందిస్తున్న కలెక్టర్ పాటిల్

మంచుపల్లి: పీఎం శ్రీ బాబు క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరం పదో తరగతిలో 537 మార్కులు సాధించిన వట్టికొండ వేదశ్రీ నాగ అంజలి ట్రిపుల్ ఐటీ బాసర సాంకేతిక కళాశాలలో సీటు సాధించింది. ఈ మేరకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మంగళవారం ఆమెను అభినందించారు. అంజలి తల్లిదండ్రులు ఆటో డ్రైవర్ వట్టికొండ మురళీ, ఐకేపీ గ్రామ దీపిక కవితలను సన్మానించారు.

పబ్లిక్ టాయిలెట్లపై అవగాహన



మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

ఇల్లెందు: పట్టణ ప్రజలు, పట్టణానికి వివిధ పనుల మీద వచ్చే ప్రజలు బహిరంగ మలమూత్ర విసర్జన చేయరాదని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ కోరారు. మంగళవారం ఇల్లెందు పట్టణంలోని హాస్పిటల్ ఏరియా వద్ద గల పబ్లిక్ టాయిలెట్లను 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పరిశీలించారు. మాట్లాడుతూ... బహిరంగ మలమూత్ర విసర్జన చేయటం వల్ల ఇతరులకు పలురకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అందరూ పబ్లిక్ టాయిలెట్లను ఉపయోగించాలని కోరారు.

దళితులు ఉద్యమించాలి

సుజాతనగర్: దళితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమించాలని ప్రముఖ న్యాయవాది మారపాక రమేష్ పిలుపునిచ్చారు. మాదిగ ఐక్యవేదిక రెండో నిర్మాణ సమావేశాన్ని మంగళవారం సుజాతనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో దళిత జాతిపై జరుగుతున్న వివక్షపై పోరాడాలని, ఆర్థిక, రాజకీయ రంగాలలో దళితులు ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేల్పుల భాస్కర్, కాటూరి సంజీవరావు, కత్తి బాలకృష్ణ, అంకిశెట్టి రామకృష్ణ, దామెర్ల సర్వేశ్వరరావు, కత్తి వెంకన్న, మురిపిటి రాములు తదితరులు పాల్గొన్నారు.

స్థలదాతకు సన్మానం..



కోటేశ్వరరావును సన్మానిస్తున్న నాయకులు

జూలూరుపాడు: జిల్లా ఆర్యవైశ్య మహాసభ భవన నిర్మాణానికి 400 గజాల స్థలం ఇచ్చేందుకు ముందుకొచ్చిన పాపకొల్లు గ్రామానికి చెందిన మహాసభ పొలిటికల్ కమిటీ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావును మంగళవారం స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దారా రమేష్, పెండ్యాల విజయభాస్కర్, తొండెపు నాగమణి, ఎలుగురి నగేష్ కుమార్, తాతా శ్రీనివాస్, ఉడుతా వెంకటేశ్వర్లు, పెండ్యాల రామనరసింహారావు, ప్రసాద్‌రావు, దారా ధీరజ్, కొదుమూరి భాను ప్రకాష్, పెండ్యాల కృష్ణమూర్తి, వందనపు కమలాకర్, సత్యనారాయణ, సుబ్బారావు, కేశ శేఖర్, ఉడుతా కొండలరావు, బండారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

సింగరేణి(కొత్తగూడెం): సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహిస్తున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని, పార్టీ డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవం నిర్వహించాలని ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం గోపాలరావు, బానోత్ ధర్మ, పెద్దబోయిన సతీష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా

ఇల్లెందురూరల్: పోచారంతండా గ్రామ సమీపంలో మంగళవారం కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ బోల్తా పడింది. ఖమ్మం నుంచి కంకరలోడుతో బయలుదేరిన టిప్పర్ పోచారంతండా మీదుగా గుండాల మండలం శెట్టుపల్లి వెళ్తుండగా గుట్ట ఎక్కుతున్న క్రమంలో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

అంగన్‌వాడీల్లో తగ్గిన ప్రవేశాలు

- ఫలించని 'అంగన్‌వాడీ బాట'
- టీచర్ల లేక తల్లిదండ్రుల అనాసక్తి



పుల్లాయిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

పాల్వంచరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల ప్రవేశాలు ఆశించిన స్థాయిలో ఈ ఏడాది పెరగలేదు. గతేడాది ప్రవేశాలు ఈ సంవత్సరం ప్రవేశాలను చూస్తే ప్రవేశాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. పాల్వంచ మండలంలో మొత్తం 67 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా పాండురంగాపురం, ఉల్వనూరు, జగన్నాథపురం మూడు సెక్టార్లు ఉన్నాయి.

ప్రవేశాలు...

2024–2025లో 67 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు 289, బాలింతలు 239, ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల చిన్నారులు 1,163, మూడు సంవత్సరాల నుంచి ఆరు సవంత్సరాల చిన్నారులు 750 మంది ఉన్నారు. 2025–2026లో గర్భిణులు 283, బాలింతలు 201, ఆరునెలల నుంచి మూడు సంవత్సరాల చిన్నారులు 1,073, మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల చిన్నారులు 748 మంది మాత్రమే ఉన్నారు. ఈ ఏడాది గర్భిణులు గతేడాది కంటే ఆరుగురు తగ్గారు. బాలింతలు గతేడాది కంటే 38 మంది తగ్గారు. ఆరునెలల నుంచి మూడేళ్ల వయస్సు కలిగిన చిన్నారులు గతేడాది కంటే ఈసారి 90మంది, మూడేళ్ల వయస్సు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులు గతేడాది కంటే ఈసారి ఇద్దరు తగ్గారు.

ఫలించని అమ్మ మాట – అంగన్‌వాడీ బాట

అమ్మ మాట – అంగన్‌వాడీ బాట పేరుతో మహిళా స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పదిరోజులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బడిఈడు పిల్లలు గుర్తించినా ఆశించిన స్థాయిలో ప్రవేశాలు జరగలేదు.

పౌష్టికాహారం పంపిణీ...

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు, ఎదిగేందుకు అవసరమైన పౌష్టికాహారాన్ని ఉచితంగా అందజేస్తున్నారు. వీటితోపాటు దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బాలామృతంతో పాటు, మధ్యాహ్న భోజనాలు ప్రతీరోజు పాలు, గుడ్డు అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చేరే పిల్లలకు ప్రతీనెల బరువు, ఎత్తును తూకం వేసి లోపాలను గుర్తించి అందుకు అవసరమైన ఆహారం అందించేందుకు సూచనలు చేస్తున్నారు. పరిస్థితిని బట్టి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించి సరైన డైట్ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పూర్వప్రాథమిక విద్యను కూడా అందిస్తున్నారు. అలాగే, కేంద్రాల్లో పిలలకు బొమ్మలతో సులభవంగా అర్థమయ్యే విధంగా బోధనలు నిర్వహిస్తున్నారు.

టీచర్లు లేక...

మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సు పిల్లల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అంగన్‌వాడీ కేంద్రాల్లో లక్ష్యం నెరవేరడం లేదు. ప్రీస్కూల్ కిట్లను ఉపయోగించడం లేదు. ఆటవస్తువులతో పిల్లలకు మానసికోల్లాసం కలిగేలా చర్యలు కంటితుడుపుగానే ఉన్నాయి. చిన్నారులకు ప్రాథమిక విద్యను ఆటల రూపంలో బోధించాల్సి ఉంది. ఇందుకు ప్రభుత్వం ప్రతీ కేంద్రానికి రౌండ్‌టేబుల్, ర్యాక్ కిట్లు, రంగులను గుర్తించే వస్తువులు, ప్లాస్టిక్ వాటితో ఇల్లుకట్టడం, అమర్చడం, తదితర ఆటవస్తువులను అంగన్‌వాడీ కేంద్రాలకు అందించింది. ఇవి టీచర్లు లేని కేంద్రాల్లో నిరుపయోగంగా ఉన్నాయి.

పదేళ్లుగా టీచర్ లేదు...



దంతలబోరు ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పది సంవత్సరాలుగా టీచర్ లేదు. దీంతో పిల్లల సంఖ్య తగ్గింది. అయినా ఏ అధికారులూ పట్టించుకోవడం లేదు.

– గద్దల రమేష్, దంతలబోరు, ఎస్సీ కాలనీ

టీచర్లను నియమించాలి..



నారాయణరావుపేటలో అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌లేక ఆయా ఒక్కరే పనిచేస్తున్నారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు అసలే లేరు. టీచర్‌ను నియమిస్తే పెరుగుతారు.

– గంగుల వెంకటేశ్వరరెడ్డి, నారాయణరావుపేట

స్వల్పంగా ప్రవేశాలు తగ్గాయి..



ఈ ఏడాది అమ్మమాట – అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పిల్లల ఎన్‌రోల్‌మెంట్ బాగానే జరిగింది. టీచర్లు లేని కేంద్రాల్లో ఈసారి పిల్లల చేరికలు స్వల్పంగా తగ్గాయి.

– లక్ష్మీప్రసన్న, సీడీపీఓ, పాల్వంచ

యూరియా సరిపడా సరఫరా చేయండి..



ధర్నా చేస్తున్న ఎన్డీ నాయకులు

ఇల్లెందురూరల్: రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు మాట్లాడుతూ.. సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా రైతులకు యూరియా సకాలంలో సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జె.సీతారామయ్య, సారంగపాణి, పూనెం రంగయ్య, కల్తి వెంకటేశ్వర్లు, పర్శిక రవి, ఈసం కృష్ణ, ఎట్టి నర్సింహారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టులు భర్తీ చేయాలి

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, మందులు అందుబాటులో ఉంచాలని పీవైఎల్ డిమాండ్ చేసింది. మంగళవారం ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్, రాష్ట్ర నాయకులు మోతీలాల్, పీఓడబ్ల్యూ పట్టణ కార్యదర్శి కోటక్క మాట్లాడుతూ... వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేసి ఖాళీలు భర్తీ చేయకపోవడంతో సరైన వైద్యం అందటం లేదన్నారు. ప్రతీదానికి ఖమ్మం, కొత్తగూడెం రిఫర్ చేసి చేతులు దులుపుకునే పద్ధతికి స్వస్తి పలకాలని కోరారు.

సౌండ్ సిస్టం వితరణ

జూలూరుపాడు: కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన వందనపు ముత్యం, పుష్పావతి జ్ఞాపకార్థం వారి కుమారుడు వందనపు వెంకటేశ్వర్లు, పద్మావతి దంపతులు సౌండ్ సిస్టం, డీజే బాక్స్‌ను వితరణ చేశారు. రూ.10,000 విలువ చేసే సౌండ్ సిస్టం, డీజే బాక్స్‌ను మంగళవారం దాత వెంకటేశ్వర్లు దంపతులు హైస్కూల్ హెచ్‌ఎం పి.సంజీవరావుకు అందజేశారు.

స్టేషన్‌కు వచ్చే వారికి మర్యాద ఇవ్వాలి



సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

టేకులపల్లి: పోలీసు స్టేషన్‌కు వివిధ పనులు, సమస్యలపై వచ్చే వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని టేకులపల్లి సర్కిల్ సీఐ బత్తుల సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన టేకులపల్లి పోలీసు స్టేషన్‌ని సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. మాట్లాడుతూ పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని, పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎస్‌ఐతో పాటు పోలీసు సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. వివిధ సమస్యలతో స్టేషన్‌కు వచ్చి ఇచ్చే ఫిర్యాదులను స్వీకరించి పారదర్శకంగా రశీదులు అందజేయాలని తెలిపారు. సమస్యలు పరిష్కరించడంలో పారదర్శకత పాటించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ఆలోచించకుండా సకాలంలో తెలియజేయాలని సిబ్బందికి సూచించారు.

ఇళ్ల నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలి



ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం చేసుకోవాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జగన్నాథపురం గ్రామంలో 29 మందికి మంజూరైన ఇళ్ల నిర్మాణ పనుల మార్కింగ్‌ను ఎంపీడీఓ కె.విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి కొత్వాల పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 400 – 600 చదరపు అడుగుల వైశాల్యం లోపల ఇంటి నిర్మాణం చేసుకోవాలని చెప్పారు. బేస్మెంట్ లెవల్ రూ.1లక్ష, రూఫ్ రూ.1లక్ష, స్లాబ్ రూ.2లక్షలు, నిర్మాణం పూర్తయిన తర్వాత రూ.1లక్ష బిల్లులు మంజూరవుతాయన్నారు. పది ట్రిప్పుల ఇసుకను కూడా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వై.చెన్నకేశ్వరరావు, హౌజింగ్ ఏఈ రమేష్ బాబు, ఆర్టీఏ సభ్యులు బాదర్ల జోషికుమార్, కొండం వెంకన్న పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష



కొత్తగూడెంటౌన్: చిట్టి రామవరంలో ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు



టేకులపల్లి: మాట్లాడుతున్న సీడీపీఓ తార

కొత్తగూడెంటౌన్/సింగరేణి(కొత్తగూడెం): తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని కొత్తగూడెం సీడీపీఓ పద్మ అన్నారు. మంగళవారం చిట్టి రామవరంలోని అంగన్‌వాడీ సెంటర్లు – 1, 2 కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

కొత్తగూడెం సీడీపీఓ పద్మ మాట్లాడుతూ... బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా, తల్లిపాలే శ్రీరామ రక్ష అన్నారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు తాగించాలని చెప్పారు. తల్లిపాలకు ప్రత్యామ్నాయం లేదన్నారు. సూపర్‌వైజర్ పార్వతి, డాక్టర్ అజయ్, ఏఎన్ఎం వరకుమారి, టీచర్లు పాల్గొన్నారు.

టేకులపల్లి: చంటిబిడ్డలకు ముర్రుపాలు శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కేఎం తార అన్నారు. ఈ మేరకు ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం టేకులపల్లి, బోడు, సులానగర్, బొమ్మనపల్లి, గంగారం సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవ వేడుకలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ... ఆరునెలల వరకు బిడ్డలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ముర్రుపాలలో పిల్లలకు వ్యాధి నిరోధకశక్తిని పెంచే లాక్టోస్ ఉంటుందని, దీనివలన పిల్లలకు ఎటువంటి అనారోగ్యం రాకుండా కాపాడుతుందని చెప్పారు. సీహెచ్ఓ వజ్జా పార్వతి, వైద్యాధికారి వెంకటేశ్, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సింగరేణిలో వన మహోత్సవం



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న జీఎం కృష్ణయ్య, అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో వన మహోత్సవం నిర్వహించారు. మంగళవారం స్థానిక జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి జీఎం వీసం కృష్ణయ్య మొక్కలు నాటారు. జీఎం మాట్లాడుతూ సింగరేణి ఏటా వేల ఎకరాల్లో మొక్కలు నాటి పెంచుతోందన్నారు. స్కూల్‌లో తరగతి గదిని సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సందర్శించి ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ అధికారి జాకీర్ హుస్సేన్, డీజీఎం పర్సనల్ తుకారం, ఎన్విరాల్‌మెంట్ అధికారి సతీష్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



పైడిపల్లి లక్ష్మి, అధ్యక్షురాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) కొత్తగూడెం పట్టణ నూతన కార్యవర్గాన్ని మంగళవారం శేషగిరిభవన్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పట్టణ గౌరవ అధ్యక్షురాలిగా మనుబోతుల శైలజ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.భాగ్యలక్ష్మి, అధ్యక్షురాలిగా పైడిపల్లి లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా షేక్ షాహిన్, ఉపాధ్యక్షులుగా పి.ధనలక్ష్మి, జి.కళ్యాణి, ఎం.కళ్యాణి, పి.రమాదేవి, సహాయ కార్యదర్శులుగా ఎం.విజయలక్ష్మి, కె.అరుణ, నాగమణి, ఎస్.సుజాత, షమీమ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్‌డీ కౌసర్, కోశాధికారిగా షహరాబేగంలను ఎన్నుకున్నారు. వీరితో పాటు 21 మంది కార్యవర్గసభ్యులు, 63 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.

సింగరేణి కళాశాలలో సింపోజియం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పురుషోత్తం

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా మంగళవారం వెర్బల్ విక్టరీ – ద పవర్ ఆఫ్ కమ్యూనికేషన్ అంశంపై సింపోజియం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కాకతీయ విశ్వ విద్యాలయం నుంచి ప్రొఫెసర్ కె.పురుషోత్తం, నర్సంపేట జీడీసీ ప్రొఫెసర్ మల్లం నవీన్ హాజరయ్యారు. పురుషోత్తం కమ్యూనికేషన్ అండ్ లైఫ్ స్కిల్స్‌పై మాట్లాడుతూ కమ్యూనికేషన్ జీవితంలో అత్యంత ప్రధానమైన నైపుణ్యాలలో ఒకటన్నారు. ఇది జీవితంలో ప్రతీ అంశాన్ని ప్రభావితం చేస్తుందని, బలమైన బంధాలను నిర్మించడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. చదువు ఎంత ఉన్నా భావాలను ఎదుటి వారికి కమ్యూనికేట్ చేసే విధానంలో లోపం ఉంటే సరిగా వ్యక్తపరచ లేరన్నారు. అలాగే జీవ నైపుణ్యాలు లేకపోతే జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కోలేరని చెప్పారు. ప్రతీ విద్యార్థి కమ్యూనికేషన్ అండ్ లైఫ్ స్కిల్స్‌ను అభ్యసించి తమ వ్యక్తిగత జీవితాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ప్రొఫెసర్ నవీన్ అన్ లాకింగ్ ద పవర్ ఆఫ్ ఎఫెక్టివ్ కమ్యూనికేషన్‌పై మాట్లాడుతూ ప్రభావితమైన సంభాషణ ఒక శక్తివంతమైన సాధనమన్నారు. ఇతరులకు తమ భావాలు, సంభాషణలను స్పష్టంగా, సమర్థవంతంగా అందించే విధానమని పేర్కొన్నారు. వ్యక్తిగత జీవితంలో ఎంతో ముఖ్యమని, మనలో దాగి ఉన్న సామర్థ్యాన్ని తెలుసుకుని మెరుగుపర్చుకుంటూ మాట్లాడితే నమ్మకం పెరుగుతుందన్నారు. నాయకత్వ లక్షణాలు, మానవ సంబంధాలు మెరుగుపడతాయని, శ్రద్ధగా వినడం, స్పష్టంగా సంక్షిప్తంగా మాట్లాడడం, బాడీ లాంగ్వేజీకి కూడా ప్రాముఖ్యనివ్వడం, ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం, నిత్యం అభ్యాసన చేయడం వంటి పనుల ద్వారా ప్రభావంతమైన సంభాషణ శక్తి అలవడుతుందని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి సింపోజియం కార్యదర్శి, ఇంగ్లిష్ విభాగం హెచ్‌ఓడీ జి.మంజుల కార్యక్రమ నివేదికను ప్రవేశపెట్టారు. ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ ఎండి నస్రీన్ బేగం, కె.ఆశాజ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..



సీఎండీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఇందుకు యూనియన్లతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ అనుబంధ టీఎస్ఈఈయూ (327) నాయకులు అన్నారు. ఈ మేరకు మంగళవారం జెన్కో రాష్ట్ర కార్యవర్గ నాయకులు సీఎండీ హరీష్, హెచ్‌ఆర్ డైరెక్టర్లను కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన సీఎండీ త్వరలోనే మీటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారన్నారు. భూపాల్‌రెడ్డి, సాధం రామకృష్ణారావు, కరుణాకర్‌రెడ్డి, ఎంఎ.మజీద్, పి.మాధవరావు, సాయిబాబు, జక్కుల రమేష్, తిరుపతి, భాస్కరరావు, సముద్రాల రాజు, కృష్ణనాయక్, భూమయ్య పాల్గొన్నారు.

'చల్లసముద్రం' ఆయకట్టులో కరువు

- పేరులోనే జలం.. ఫైరుకు అల్లంత దూరం
- వనరులు లేక చెరువులోకి అరకొరగా వరద నీరు
- గోదావరి జలాల మళ్లింపుపైనే రైతుల ఆశలు



అరకొరగా నీరు చేరిన చల్లసముద్రం పెద్ద చెరువు



బీడుగా ఉన్న ఆయకట్టు

ఇల్లెందురూరల్: పెద్దచెరువుగా ఉండటంతోపాటు పేరులో సముద్రం మిళితమై ఉన్న ఆ చెరువు కుంభవృష్టిగా వర్షాలు కురిస్తే తప్ప సాగుకు నీటిని అందించలేక పోతోంది. అరుదుగా అలుగు పోస్తూ కరువుకు పుట్టినిల్లుగా ఈ చెరువు దశాబ్దాలుగా అపవాదును మూటగట్టుకుంటోంది. మండలంలోని పెద్ద చెరువులలో ఒకటిగా ప్రభుత్వ రికార్డులలో ఉంది చల్లసముద్రం పెద్దచెరువు. మరమ్మతులకు తరచూ రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా పాలకులు చెరువుకు నీటివనరు సమకూర్చడంపై ఆలోచన చేయడం లేదని రైతులు వాపోతున్నారు.

1,350 ఎకరాల ఆయకట్టు...

చల్లసముద్రం పెద్దచెరువు ఇరిగేషన్ శాఖ రికార్డుల ప్రకారం 1,350 ఎకరాల ఆయకట్టు, చెరువు లోతట్టు 339 ఎకరాలు. చెరువు పూర్తి నీటినిల్వ సామర్థ్యం 90 ఎంసీఎఫ్‌టీ. ఇరిగేషన్ శాఖ లెక్కల ప్రకారం ఒక ఎంసీఎఫ్‌టీ నీరు ఆరు ఎకరాలకు సరిపోతుంది. ఈ లెక్కన చెరువు ఒకసారి నిండితే కేవలం 540 ఎకరాలకు మాత్రమే నీటిని అందిస్తుంది. ఆయకట్టు మొత్తానికి నీటిని సమృద్ధిగా అందించాలంటే చెరువు రెండుసార్లు అలుగు పోయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం చెరువు ఒకసారి అలుగు పోయడమే గగనంగా మారడంతో చెరువు ఆయకట్టు కింద కరువు ఛాయలు అలముకుంటున్నాయి. ప్రస్తుతం చెరువులో కేవలం 30శాతం మాత్రమే నీరు ఉన్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రస్తుత సీజన్‌లో మరోసారి కరువు పరిస్థితులను ఎదుర్కోవాల్సిన దుస్థితి.

అరకొరగానే నీటి వనరు..

సాధారణంగా పెద్దచెరువులకు మరమ్మతుల కంటే నీటివనరును వృద్ధి చేయడంపైనే పాలకులు, అధికారులు దృష్టి సారించాల్సి ఉంటంది. కానీ పెద్దచెరువుగా, మండలంలో అత్యధికంగా ఆయకట్టు కలిగి ఉన్న చెరువుగా గొప్పగా చెప్పుకునే చల్లసముద్రం పెద్దచెరువుకు చెప్పుకోదగ్గ నీటివనరు ఒక్కటీ లేదు. కేవలం లచ్చగూడెం ఎర్రచెరువు అలుగు పోస్తే ఆ వరద మాత్రమే చల్లసముద్రం పెద్ద చెరువులోకి చేరుతుంది. ఈ పరిస్థితిలో రాష్ట్రం మొత్తం కుంభవృష్టి కురిస్తే తప్ప చల్లసముద్రం పెద్దచెరువు అలుగు పోసే పరిస్థితి ఉండదు. ఈ కారణంగా దశాబ్దంలో ఒకటి, రెండు ఏళ్లు మాత్రమే ఈ చెరువు ఆయకట్టు కింద వరి పంట పండుతుందని రైతులు చెబుతున్నారు.

ఫలించని ఉద్యమాలు...

చల్లసముద్రం పెద్దచెరువుకు నీటి వనరు మెరుగుపర్చాలని దశాబ్దం క్రితం రాజకీయ పక్షాలు ఆందోళనలు చేపట్టాయి. ఇల్లెందు మండలం నుంచి ప్రారంభమయ్యే మస్సివాగును మామిడిగుండాల గ్రామపంచాయతీ మేడికుంట ప్రాంతం నుంచి కాలువ నిర్మించి లచ్చగూడెం చెరువుకు, అక్కడి నుంచి చల్లసముద్రం పెద్దచెరువుకు నీటివనరు ఏర్పాటు చేయాలని నాటి రాజకీయ పక్షాల డిమాండ్ ఉంది. కానీ సహజసిద్ధంగా బయ్యారం పెద్దచెరువు ఉన్న నీటి వనరులలో ఒకటైన మస్సివాగును మళ్లించే ప్రయత్నం ఎవరూ చేయలేదు. దీంతో కొద్దికాలం ఆందోళనలు కొనసాగించిన రాజకీయ పక్షాలు చివరకు నీరసించి కాడి వదిలేశాయి.

సీతారామ ఊరటనిస్తుందా..?

మారుమూల ప్రాంతాలకు సాగునీటి సౌకర్యం మెరుగుపర్చే లక్ష్యంగా రూపుదిద్దుకున్న సీతారామ ప్రాజెక్టు చల్లసముద్రం పెద్దచెరువు ఆయకట్టు రైతులలో ఆశలు చిగురింపజేసింది. ఈ ప్రాజెక్టుకు ఇల్లెందు నియోజకవర్గంలోనే శంకుస్థాపన జరగడం పంపింగ్ ద్వారా రోళ్లపాడు నుంచి బయ్యారం పెద్దచెరువుకు నీటి మళ్లింపులో చల్లసముద్రం పెద్దచెరువు కూడా నీటిని అందించాలని తొలి ప్రతిపాదన ఉండడం ఈ ప్రాంత రైతలకు ఊరట కలిగించింది. కానీ ఆ తరువాత జరిగిన పరిణామాలతో సీతారామ ప్రాజెక్టు నియోజకవర్గానికి దూరం కావడంతో చల్లసముద్రం పెద్దచెరువు దుస్థితి మొదటికొచ్చింది. ప్రస్తుతం మరోసారి ప్రాజెక్ట్ రీడిజైనింగ్ పేరుతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించే పనిలో నిమగ్నమైనట్లు ప్రచారం జరగడంతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురింపచేస్తున్నాయి.

ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం...



ఏటా అందరూ వరుణుడు కాస్తా కరుణిస్తే చాలు అనుకుంటారు. మేము మాత్రం కుంభవృష్టి కోసమే ఎదురుచూడాల్సి వస్తోంది. అధిక వర్షాలే మాకు ఊరటనిస్తాయి. పెద్దచెరువుకు నీటివనరు వృద్ధి కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నాం. ఎవరూ పరిష్కారం చూపడం లేదు.

– ధనియాకుల బాబు, చల్లసముద్రం

గోదావరి జలాలను మళ్లించాలి...



గతంలో మస్సివాగు నీటిని మళ్లించాలని ఉద్యమించాం. బయ్యారం పెద్దచెరువు ఆయకట్టు రైతుల అభ్యంతరంతో ముందుకు సాగలేదు. తాజాగా సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను మళ్లించే ప్రతిపాదనల్లో చల్లసముద్రం పెద్దచెరువు సింహభాగం కల్పించాలి.

– నరాటి వెంకటేశ్వర్లు, వేములవాడ